

ఇంటర్ పరీక్షలో ఇద్దరు డీబార్

కడప అర్బన్ : శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలో పులివెందులలోని వేర్వేరు పరీక్షా కేంద్రాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు. రాయచోటిలో పరీక్ష కేంద్రాలను విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 20,369 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 19,934 విద్యార్థులు హాజరయ్యారు. 705 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షల రాష్ట్ర పరిశీలకులు రవిశంకర్ నాయక్ పోరుమామిళ్లలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వృత్తి విద్యాధికారి శ్రీనివాసులురెడ్డి బద్వేలులోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆర్ఐఒ రమణ రాజు నగరంలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

టిడిపికే 'పట్టం'

- పట్టభద్ర ఎమ్మెల్సీగా రామ్‌గోపాల్‌రెడ్డి ఎన్నిక
- 'వెన్నపూస'తో హోరాహోరీ పోరు
- 7,543 ఓట్ల మెజార్టీతో విజయం
- పిడిఎఫ్ ఓట్లతోనే గెలుపుబాట
- టిడిపి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎమ్మెల్సీగా టిడిపి మద్దతుదారు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి గెలుపొందారు. మూడ్రోజులుగా అనంతపురం జెఎన్‌టియులో చేపట్టిన కౌంటింగ్‌లో తన సమీప ప్రత్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి నుంచి ఎదురైన ఉత్కంఠ భరిత పోరులో 7,543 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 49 మంది అభ్యర్థులు నిలిచిన సంగతి తెలిసిందే. వీరిలో భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, వెన్నపూస రవీం ద్రారెడ్డి మధ్య హోరాహోరీగా చివరి వరకు పోరు నడిచింది. వీరిలో ఎవరికీ 50 శాతం ఓట్లు లభించని నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్య ఓటును లెక్కించాల్సి వచ్చింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,45,513 ఓట్లు పోలు కాగా, 19,108 చెల్లని ఓట్లుగా తేలినట్లు సమాచారం. పోలైన 2,26,405 ఓట్లలో అధికార వైసిపి మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డికి 1,02, 238 ఓట్లు రాగా, టిడిపి మద్దతుదారు రామ్ గోపాల్‌రెడ్డికి 1,09,781 ఓట్లు రావడం గమనార్హం. 7,543 ఓట్ల మెజార్టీతో టిడిపి మద్దతుదారు రామ్ గోపాల్‌రెడ్డి గెలుపొందారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర నుంచి ఎన్నికల ప్రచారం, కౌంటింగ్ దశల వరకు ప్రత్యర్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పరిశీలన, ఉపసంహరణ దశల అనంతరం హోరాహోరీగా తలపడాల్సి వచ్చింది. రామ్‌గోపాల్‌రెడ్డి, వైసిపి మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డి, పిడిఎఫ్ మద్దతుదారు పోతుల నాగరాజు నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కోవాల్సి వచ్చింది. కౌంటింగ్ దశలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనూ పిడిఎఫ్ ఓటర్ల మద్దతుతోనే టిడిపి మద్దతుదారు గెలిచినట్లు తెలుస్తోంది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో మిగిలిన అభ్యర్థి ఓట్ల లెక్కింపు వరకు ఆధిక్యం చేతుల మారుతూ వచ్చింది. పిడిఎఫ్ ఓట్లు లెక్కింపు దగ్గర నుంచి రామ్‌గోపాల్‌రెడ్డిలో విజయం పట్ల ధీమా ఏర్పడింది. పిడిఎఫ్ ఓట్ల లెక్కిం పునకు ముందు దశ వరకు ఆధిక్యం చేతులు మారు తూ రావడంతో ఊపిరి బిగబట్టుకుని నిరీక్షించాల్సి వచ్చింది. పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నట్లు టిడిపి అధ్యక్షులు ప్రకటించడం ప్రతిపక్ష టిడిపి తరపున నిలిచిన అభ్యర్థులకు ఊహించిన వరంలా మారిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇదేతరహా పరిస్థితి తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపుల్లో పిడిఎఫ్ ఓట్లు ప్రతిఫలించడం చర్చనీ యాంశంగా మారింది. ఏదేమైనా టిడిపి మద్ద తుదారు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి పిడిఎఫ్ ఓట్ల దన్నుతో గెలుపొందిన నేపథ్యంలో అధికార వైసిపి పొత్తులు, ఎత్తుల వ్యూహాల పట్ల అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.



పులివెందులలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి శ్రేణులు

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పాఠశాల తనిఖీలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా విధానాన్ని విద్యార్థులకు విద్య సక్రమంగా అందించాలని పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కో-ఆపరేటివ్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రాయచోటిలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు పరిశీలించి పనులు ఆలస్యంగా చేస్తుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాయచోటిలోన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి నేరుగా నాలుగో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన పాఠ్యాంశంలోని కొన్ని ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధానం రాబట్టారు. సిలబస్ పూర్తికాకుండా ఫార్మేటివ్ 4 పరీక్షను విద్యార్థులు ఎలా రాస్తారని, సిలబస్ పూర్తి చేయనందుకు ఉపాధ్యాయుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. క్లాస్ టీచర్ విద్యార్థులకు సకాలంలో విద్యాబోధన పూర్తి చేశారా లేదా విషయాన్ని హెచ్‌ఎం, ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ ఎందుకు పర్యవేక్షణ చేయలేదని మండిపడ్డారు. విద్యార్థులను ఉపాధ్యాయులు సొంత బిడ్డల్లా చూసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఉన్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎం, ఎంఇఒ, డిప్యూటీ డిఇఒలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి వర్క్ బుక్స్ అందిస్తే వినియోగించరా? ఉపాధ్యాయులకు బాధ్యత లేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య ప్రభుత్వ లక్ష్యంగా అనేక సంస్కరణలు ప్రభుత్వం తీసుకువస్తోందని పేర్కొన్నారు. విద్యకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారు, ఉపాధ్యాయులు కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవ హరించడం సరైన పద్ధతి కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రాయచోటి కో-ఆపరేటివ్ కాలనీలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠ శాలను తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నిల్వ ఉంచిన కోడిగుడ్లు, చిక్కిల్లో క్వాలిటీ, ఎక్స్పైరీ డేట్‌లను పరిశీలించారు. విద్యార్థులకు కోడిగుడ్లను సకాలంలో అందించకపోవడం గమనించడంతో ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతివారం మధ్యాహ్నం జగనన్న గోరుముద్దను పరిశీలించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, తీరు తెన్నులు పరిశీలించి స్వయంగా విద్యార్థికి గోరుముద్దను తినిపించి రుచి చూశారు. ఈ తనిఖీలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఇఒ పురుషోత్తం, డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి, ఎంఇఒ రమాదేవి, తహశీల్దార్ ప్రేమంత్ కుమార్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యం

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి

ప్రజాశక్తి కడప అర్బన్

ఆగమ్య గోచా రంగా మారిన రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడటం చంద్రబాబుతోనే సాధ్యమనే నిర్ణయానికి ప్రజలు వచ్చారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. టిడిపి జిల్లా కా ర్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం విజ యానికి తొలిమెట్టుగా ఎమ్మెల్సీ ఫలితాలు వచ్చాయని, వైసిపి మంత్రుల నోళ్లు మూతపడ్డాయని చెప్పారు. పట్టభద్రుల స్థానాలన్నీ తామే గెలవ బోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. తూర్పు రాయలసీమలో కంచర్ల శ్రీకాం త్ భారీ మెజార్టీతో గెలుపొందడం దాదాపు ఖాయ మైందని చెప్పారు. సీఎం జగన్ రెడ్డి సొంత జిల్లాలో పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం గెలుపు కోసం రూ.40 కోట్లు పంచారని, టిడిపి పట్టభద్రుడు ఎమ్మెల్సీ అభ్యర్థి ఒక్క పైసా పంచలేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రతిపక్షం ఉండి తీరాల్సిందే అన్నారు. రాష్ట్రం అప్పుల ఎపిగా మారు తుంటే కేంద్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులు చేయించే జగన్ అరాచక పాలనకు వచ్చే ఎన్నికల్లో ప్రజ లు చమర గీతం పాడతారని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్, నగర అధ్యక్షుడు శివ కొం డారెడ్డి, మన్మోహన్ రెడ్డి, మాజీ జిపి గుర్రప్ప, హరి, జనార్ధన్, ఖాసిం పాల్గొన్నారు.

వైసిపి పతనం తప్పదు : కాంగ్రెస్

కడప : 2024లో నిర్వహించబోయే సాధారణ ఎన్నికల్లో వైసిపికి పతనం తప్పదని పిసిసి డెలిగేట్ బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ అన్నారు. ఇందుకు ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాలే నిదర్శనమని వారు చెప్పారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో చావు తప్పి కన్నులొట్టబోయిన వైసిపి పార్టీ అని వారు అన్నారు. ఎన్నికలలో వైసిపి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా పట్టభద్రుల ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నిస్సంకోచంగా, నిస్సిగ్గుగా నీతిమాలిన పనులు చేసిన వైసిపికి వ్యతిరేకంగా పట్టభద్రులు తమ ఓటు వేయడం గమనార్హం అన్నారు. మెజారిటీ స్థానాలు గెలుచుకున్నా కానీ అతి స్వల్ప మెజారిటీతో గెలుపొందరని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ పలుకుబడిని, అధికారులను, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థను, వాలంటీర్లను ఉపయో గించారని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఐఎఎస్, ఐపి ఎస్ లాంటి అధికారులు కూడా అధికార పార్టీకి తల ఊపడం శోచనీయమన్నారు.

ఆస్థాన- ఏ-షహామీరియా దర్గా గంధోత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రవీంద్ర నగర్‌లో వెలిసిన చారిత్రాత్మకమైన ఆస్థాన ఏ షహామీరియాదర్గాలోని హజరత్ ఖాజా సయ్యద్ షా అబ్దుల్ హక్ (ర.అ.) (ఉరఫ్) షహమీర్ బాషా సాహెబ్ ఖిబ్లా చిష్టివుల్ ఖాదిరి సాహెబ్ గంధం ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన యే షహామీరియ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా హుసేని బాషా షహమీరి సాహెబ్ తన స్వగృహం నుంచి గంధం కళశాన్ని ఫకీర్ల మేళతాళాలతో దర్గా వద్దకు చేరి, దర్గాలో పూల చాదర్లు సమర్పించి ఫాతెహా చేసి దర్గాలో గంధాన్ని సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నాతియా మెహఫిల్, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తాదులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభం : టిడిపి

కడప అర్బన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు పేర్కొన్నారు. శనివారం ఎన్నికల కౌంటింగ్ పాల్గొన్న వారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి విద్యావంతులను, ఉద్యోగులను, నిరుద్యోగులను, యువతను నమ్మించి మోసగించినందుకు గట్టి బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పట్టభద్రుల ఎన్నికల్లో ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ పట్టభద్రుల ఎన్నికల్లో పూర్తిగా టిడిపి బలపరిచిన అభ్యర్థులు గెలవడం వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమైందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం దొంగ ఓట్లు, డబ్బులు పంపిణీ, అరాచకం సృష్టించినా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో పులివెందులలో టిడిపి జెండా ఎగర వేసామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబారపు రమణారెడ్డి, కడప పార్లమెంట్ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు గంధం ప్రసాద్, రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

అంగన్వాడీ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, అందు కోసం ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పోరుమామిళ్ల ప్రాజెక్టు లీడర్లు ఓబులాపురం విజయమ్మ, జ్యోతి పేర్కొన్నారు. శనివారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమగ్ర శిశు అభివృద్ధి అధికారి, సూపర్‌వైజర్ హరిప్రియ, ప్రత్యూషకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ, మినీ అంగన్వాడీలలో ఆయాలు గర్భిణులకు, చిన్నారులకు సేవలందిస్తున్నారని చెప్పారు. తక్కువ వేతనంతో వెట్టి చాకిరి చేస్తున్నారని వాపోయారు. కరోనా సమయంలో వందలాది మంది కార్యకర్తలు, ఆయాలు మృతిచెందిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేనతం రూ.26 వేలు, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ బెటిఫిట్ రూ. 5 లక్షలు, వేతనంతో సగం ఫించన్ ఇవ్వాలన్నారు. మృతిచెందిన కార్మికులకు రూ.50 లక్షల బీమా అమలు చేయాని, రేష్‌కార్డులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బద్వేల్ ప్రాజెక్టు పరిధిలో సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన అంగన్వాడీల వేతనాలు చెలించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం విజయవాడలో నిర్వహించబోయే ధర్నాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, ప్రభావతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ లేకపోవడం దారుణం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి కడప అర్బన్

బడ్జెట్ సమావేశాలలో జాబ్ కేలండర్ లేకపోవడం దారుణమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. నాలుగేళ్లయినా ఒక్క జాబ్ కాలండర్ కూడా విడుదల చేయలేదని విమర్శించారు. బడ్జెట్ సమావేశాలలోనూ యువత ఉద్యోగాల భర్తీ ప్రకటన ఇస్తారేమో అనుకున్నారని, కానీ నిరాశే ఎదురయ్యిందని తెలిపారు. ఇప్పటికే లక్షలాది మంది చదువుకున్న యువత ఉద్యోగాల ప్రకటన కోసం ఎదురుచూస్తూ సంవత్సరాలుగా కోచింగ్ తీసుకుంటున్నారని చెప్పారు. డిఎస్‌సి, గ్రూప్స్ లేవరని వాపోయారు. బడ్జెట్ సమావేశాలలో అయినా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, లేకుంటే కనీసం ఉద్యోగాలు వచ్చే వరకు అయిన నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర అధ్యక్షులు షాకీర్,జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన రషీద్ ఖాన్

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి అన్బు రాజన్‌ను కడప హోటల్ అండ్ ఫుడ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చిన్నపరెడ్డి సలహా మేరకు కడప హోటల్, ఫుడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రషీద్‌ఖాన్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హోటల్స్ వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్‌పి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం విలేకరులతో రషీద్ ఖాన్ మాట్లాడుతూ హోటల్స్‌కు రాత్రి 10:30 గంటల వరకు ఉన్నా పోలీస్ పర్మిషన్ సమయాన్ని పవిత్ర రంజాన్ నెల సందర్భంగా రాత్రి 12 గంటల వరకు కడపలోని హోటల్స్ తెరిచేలా చూడాలని, అలాగే సాధారణంగా ఉన్న సమయాన్ని 11 గంటల వరకు పొడగిం చాలని విన్నవించారు. అందుకు పోలీసులు అనుమతి, సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా ఎస్‌పి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలియ జేశారు. అనంతరం ఎస్‌పిని వారు సన్మానించారు. కార్యక్రమంలో కడప హోటల్స్ అండ్ ఫుడ్ అసోసియేషన్ సెక్రటరీ ఎం నవీన్, జాయింట్ సెక్రటరీలు షేక్ ఫరూక్, రెడ్డి బాబు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌పిని సన్మానిస్తున్న రషీద్‌ఖాన్

ప్రభుత్వం కళ్లు తెరవాలి : డిసిసి

కడప : ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను చూసి ప్రభుత్వం కళ్లు తెరవాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానాలను అధికార పార్టీకి ఇవ్వకుండా ప్రతిపక్షాలకు ఇవ్వడం చూస్తుంటే జగన్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయినట్లు అనిపిస్తుంది అన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల , యువతీ యువకులు ప్రభుత్వంపై భరోసా కోల్పోయారన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. 2024లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు కోరుకునే విధంగా పాలన అందిస్తుందన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 24 కేసులు పరిష్కారం

కడప : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10:30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ లో 24 కేసులు పరిష్కరించి రూ. 54. 30 లక్షలు కక్షిదారులకు చెల్లించారు. ప్రత్యేక లోక్ అదాలత్ సందర్భంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, బద్వేలు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులలో బెంచ్ లు ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ మెంబెర్స్, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు చేసి వారివారి కేసులను పరిష్కరించుకున్నారు. కోవిడ్-19 నియమావళిని పాటిస్తూ నిర్వహి ంచారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందుకు న్యాయవాదులకు, పోలీసు అధికారులకు, నాలుగవ జిల్లా జడ్జి జి. గీత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్ హేమలత కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించాలని ఎన్ఆర్‌డి ప్రాజెక్టు అధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో డిడియు జికెవై ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య జిల్లాలో గ్రామీ ణ యువతకు శిక్షణ ఇస్తున్న సంస్థలను ఆయన శనివారం తనిఖీ చేశారు. అందులో భాగంగా నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థను సందర్శించారు. కేంద్రం అందజేస్తున్న పథకాలు విద్యార్థులకు అందుతున్నాయా లేదా, లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో పరస్పరం చర్చించి తర్వాత మధ్యాహ్నం కలిసి భోజనం చేశారు. సంస్థలో శిక్షణ తీసుకున్న పూర్వ విద్యా ర్థులకు ఫోన్ చేసి ప్రస్తుతం జాబ్ చేస్తున్నారా లేదా అనేది తెలు సుకున్నారు. కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, ప్రతినిధులు సుబ్బరామిరెడ్డి,తేజ, గంగులయ్య పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ పవన్ కుమార్

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

కడప అర్బన్ : అనంతపురంలో ప్రభుత్వ వైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్ సి.హరికృష్ణ 300 విలువైన మెడికల్ పోటీపరీక్షల పుస్తకాలను ఆయన తండ్రి, కడప నగరంలోని మూర్తి ఫోటోస్టూడియో అధినేత సి.మురళీకృష్ణ, కైలాస్ ప్రెస్ సాగర్ కలిసి శనివారం సాయంత్రం కడపలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉపకులపతి ఆచార్య జి.రంగ జనార్ధన, కులసచివులు ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, సిబ్బంది పి.చంద్రకిశోర్ అభినందించారు.

కెవిఎం జనరల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎర్రముక్కపల్లె ఎస్‌విడిసి సర్కిల్ సమీపంలో కెవిఎం జనరల్ స్టోర్‌ను తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు కళ్యా సుధాకర్, మోతుకూరు సుబ్బ రాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్ ధరలకే నిత్యావసర సరుకులు లభిస్తాయని చెప్పారు. నాణ్యమైన మన్నికతో కూడిన సరుకులు జనరల్ స్టోర్ యజమానులు కాల్వ గంగాధర్, వాగేష్ ప్రజలకు అం దుబాటులో సరసమైన ధరలకే తీసుకురావడం అభినం దనీయమని చెప్పా రు. బ్రాండెడ్ కంపెనీల సరుకులతో పాటు, రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ఉత్పత్తులను సైతం అందుబాటులో ఉంచడం హర్షనీయ మన్నారు. యజమానులు మాట్లాడుతూ స్థానికులు తమ జనరల్ స్టోర్‌లో నిత్యవసర వస్తువులు కొను గోలు చేసి వ్యాపార అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పల్లా నరసింహారావు, టేకూరి సుదర్శన్, కొర ముట్ల సుబ్బ రాయుడు, గోవిందు వెంకటరమణ, టేకూరి పుష్పాంగదా, కాల్వ ప్రభావతి, ఇంద్రావతి, బొమ్మిశెట్టి లోకేష్, నవ్య శ్రీ, మోహిత్, నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

జనరల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న కల్యాసుధాకర్

అవార్డుల ప్రదానోత్సవం

కడప అర్బన్ : ప్రగతి ఫౌండేషన్ జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వారిని గుర్తించి ఫౌండేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేశారు. వివిధ జిల్లాల నుంచి అనేకమంది ప్రతినిధులు హాజరయ్యారు. చైర్పర్సన్ సమీరా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రగతి ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ ఆరిఫుద్దిన్, అతిథులుగా కడప ఫైర్ స్టేషన్ ఎస్ఐ షంషీర్, కేతుర, సి.ఆర్.వి. ప్రసాద్, కంబదూరి నబి రసూల్, అమృతవల్లి, రచన, జ్యోతి లియా కుమారి, పి రామకృష్ణారెడ్డి, పుట్ట శివారెడ్డి హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన వారిని ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘ నంగా సన్మానించారు. 100 మంది ప్రతినిధులు హాజరైనారు. ప్రగతి ఫౌండేషన్ చిత్ర స్థాయిలో వివిధ రంగాలలో సేవ చేస్తున్న వ్యక్తులను సంస్థలను ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని వారికి అండదండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

కల్యాణ వేదికను సుందరంగా తీర్చిదిద్దాలి : జెఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఏప్రిల్ 5న శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా కల్యాణ వేదికను సుందరంగా తీర్చిదిద్దాలని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. పేర్కొన్నారు. శనివారం ఆయన కల్యాణ వేదిక వద్ద నిర్వహిస్తున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లా డుతూ కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాంగణమంతా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. లక్షలాదిగా విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కల్యాణం రోజున అన్న ప్రసాదం, తాగునీరు, మజ్జిగ, తలంబ్రాలు పంపిణీ చేయాలన్నారు. ఆలయం, పరిసర ప్రాంతాలలో తగినన్ని తాత్కాలిక, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పరి శుభ్రత, పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికా రులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ స్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి కల్యాణ వేదిక, ముఖ్యమంత్రి విడిది చేసే భవ నం, ఆలయ పరిసరాలు, పుష్కరిణి, వాహన మండపం, అన్నప్రసాదాలు, తాగు నీరు పంపిణీ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అధికారులకు సూచనలిస్తున్న జెఇఒ

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కడప అర్బన్ : కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ, ప్రైమ్ ఆస్పత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఈనెల 19న నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎఫ్.ఎం. ముత్యాల అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ అక్షిత చంద్రశేఖర్, డాక్టర్ గంగా ప్రసాద్ రెడ్డి, డాక్టర్ బింగి ప్రతాప్, డాక్టర్ మహేష్ బృంగి, డాక్టర్ అబ్దుల్ మజీద్ ఖాన్ మయానా సేవలు అందిస్తారని తెలిపారు. షుగర్, బిపి. పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. రోగులను డాక్టర్లు పరీక్షించి మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ప్రజలు వైద్య శిబిరంలో విరివిగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

కడప : అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ వాయు ఎంపికలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ తెలిపారు. ఈనెల 17 నుంచి 31 వరకు https://agnipathvayu.cdac.in ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెంపపెట్టు!

ప్రజా 'దృష్టి'

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసిపికి చెంపపెట్టును తలపించాయని చెప్పవచ్చు. ఈ నెల 13న పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో ఉపాధ్యాయ, పట్టభద్ర స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో అధికార వైసిపి మద్దతు పొందిన అభ్యర్థులు ఓటర్ల జాబితా దగ్గర నుంచి ఓటింగ్ దశ వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి,రామచంద్రారెడ్డి సాధించిన విజయం మెల్లకన్ను లొట్టబోయిన పరిస్థితి తలెత్తింది. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్సీ మద్దతుదారు బి.రామగోపాల్‌రెడ్డి మంచి మెజార్టీతో గెలుపొందనుండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎటువంటి ప్రలోభాలకు గురిచేయకుండా స్వచ్ఛందంగా ప్రజలు ఆదరించిన వైనం చర్చనీయాంశంగా మారింది. అధికార వైసిపి సర్కారు తన ఐదేళ్ల కాలవధిలో సంక్షేమం పేరుతో అభివృద్ధిని, యువత ఆకాంక్షలను విస్మరించిన ఫలితం అధికార వైసిపి వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమాలను జోడెద్దులుగా సాగించాల్సి ఉండగా, సంక్షేమాన్ని అజెండాగా మార్చుకుని సాగిన పాలనకు మేధావులు, పట్టభద్రులు హర్షించలేదని తేలిపోయింది. రాయలసీమలో నిర్మాణాత్మకమైన అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, సిఎం సొంత జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దగ్గర నుంచి రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ హామీ అమలు హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారడం తెలిసిందే. మేధావులు వైఖరి తేటతెల్లమైన నేపథ్యంలో అధికార వైసిపి మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాస్తవానికి రాజకీయ పార్టీలు మేధావులకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలి. దురదృష్టవశాత్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తెరవెనక నిలుస్తుండడంతో రాజ్యాంగ నిర్మాతల లక్ష్యం దెబ్బతింటోంది. పార్లమెంట్, శాసనసభల్లో మెజార్టీ పేరుతో మందబలం కలిగి అధికార పార్టీలు ఇష్టారాజ్యంగా చట్టాలు చేస్తుండడం వర్తమానంలో అనుభ వైద్యేకమే. ఇటువంటి చట్టాలను మేధావుల పేరుతో గెలుపొందిన ఎమ్మెల్సీలు మేధోపరమైన అవగాహనతో పరిశీలించి లోపాల్ని సవరించడానికి అవకాశాల్ని కల్పిస్తోంది. ఫలితంగా సమాజానికి హితకరమైన చట్టాలను రూపకల్పన చేయడం పరిపాటి. ఇటీవలి కాలంలో ఇటువంటి వివేకవంతులు సైతం రాజకీయ పార్టీల ప్రాపకంతో గెలుపొందుతున్న నేపథ్యం విస్మయాన్ని కలిగిస్తోంది. పార్లమెంట్, శాసనసభల్లో పెద్దలసభ, మండలి స్థానాల పేరుతో శాసనమండలి సభ్యులు, రాజ్యసభ సభ్యులుగా ఆయా రంగాలకు చెందిన నిష్ణాతులను ఎంపిక అవుతుండడం తెలిసిందే. మేధావుల స్థానాల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు సైతం అధికార పార్టీలకు అడుగులకు మడుగులొత్తుతూ ప్రయివేటు, కార్పొరేట్ సేవల భజనలో మునిగిపోయాయి. దేశంలో ఇటువంటి క్లిష్ట పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మేధావుల స్థానాల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు వివేకం, విచక్షణను కనబరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌ను మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రతిరోజు ఈ పనుల పురోగతిని తెలియజేయాలని అమేనిటీ సెక్రెటరీలకు సూచించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ట్రిపుల్‌ఐటి అధ్యాపకులు

గేట్ పరీక్షల్లో ట్రిపుల్‌ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

గేట్ 2023 ఫలితాల్లో ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటి విద్యార్థులు అలిండియా స్థాయిలో మంచి ప్రతిభ సాధించి తమ సత్తాను చాటినట్లు ట్రిపుల్‌ఐటి అధికారులు తెలిపారు. మెటీరియల్ అండ్ మెటల్జికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న నవ జీవన్ సాగర్ అలిండియా స్థాయిలో 7వ ర్యాంకు సాధించాడు. లక్ష్మి చంద్రిక 32వ ర్యాంకు, దినేష్ 255వ ర్యాంకు సాధించారు. గేట్‌లో మంచి ర్యాంకులు సాధించడం పట్ల ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ సంధ్యారాణి, అకడమిక్ డీన్ రత్నకుమారి హర్షం వ్యక్తం చేశారు. 6గురు విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగులు సాధించారని తెలిపారు.

రేపటి నుంచి చియ్యపాడులో ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో సోమవారం నుంచి రెండు రోజులపాటు ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. 2010-2016 సంవత్సరాల మధ్య ఆధార్ తీయించుకున్న ప్రతి ఒక్కరూ ప్రస్తుతం అప్డేట్ చేయించుకోవాలన్నారు. వయసు, పేరు, చిరునామా తదితర మార్పుల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన సూచించారు.

సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో పాత బకాయిలు, ప్రస్తుత ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై వన్ టైం సెటిల్మెంట్ కింద వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ34 ప్రకారం ఈనెల 31లోపు పన్ను చెల్లించేవారికి వడ్డీ మాఫీ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని పన్ను చెల్లించని వారికి వివరించాలన్నారు. ప్రస్తుతం బకాయి మొత్తము 5,777 గృహాలకుగానూ రూ.3.08 కోట్లు ఉండగా, రూ.1.18 కోట్లు ఈ స్కీమ్ ద్వారా మాఫీ అవుతుందన్నారు. పన్ను బకాయిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.

గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిన వేపచెట్టు

వేంపల్లెలో వడగండ్ల వాన

- గాలి, వానకు విరిగిన చెట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో శనివారం సాయంత్రం భారీగా వడగండ్లు వర్షం కురిసింది. దీంతో చెట్లు విరిగి పడడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఒక్కసారిగా గాలి, వాన రావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వర్షం కురిసే సమయంలో గాలి భారీగా వీచడంతో వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో పండ్ల వ్యాపారం చేసుకొనే తోపుడు బండ్లు బోల్తా పడ్డాయి. గండి రోడ్డులో పెద్ద వేప చెట్టు విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. రోడ్డుకు అడ్డంగా పడిన వేప చెట్టును తొలగించేందుకు సిఐ వెంకటేశ్వర్లు చర్యలు చేపట్టారు. గాలులకు మామిడి, చీనీ, నిమ్మ తోటల రైతులు చాల నష్ట పోయారు. ఉరుములు, మెరుపులతో వడగళ్ల వాన కురిసింది. గాలులు భారీగా వీచడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

కొండాపురం : మండలంలో శనివారం సాయంత్రం వడగండ్లతో కూడిన వర్షం పడింది. ఇలాంటి వర్షం గతంలో ఎన్నడు చూడలేదని పెద్దలు అంటున్నారు. గాలితో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో మామిడి, చీని, అరటి రైతులకు అపార నష్టం సంభవించిందని పలువురు పేర్కొంటున్నారు.

నేడు షాదీఖానాలో ఉచిత వైద్యశిబిరం

ఖాజీపేట : స్థానిక టీచర్స్ కాలనీలోని షాదీఖానా మందిరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మైదుకూరు పట్టణానికి చెందిన ఎస్-ఎల్ఆర్ హాస్పిటల్స్ వైద్యులు మూలె అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.4వేలు విలువైన వైద్య పరీక్షలు, స్కానింగ్ ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'ఉమెన్ ఐకాన్'కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- కడప అర్బన్

స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఘన, వ్యర్థాలు నివారణ ప్రతిభ కనబరిచిన మహిళల నుంచి ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు ఎంపికకు ఆసక్తి కలిగిన మహిళలు కడప నగరపాలక సంస్థలో దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా వ్యర్థాల శుద్ధికరణ, చెత్త స్వీకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి పొడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువుల తయారీ విభాగాలలో కృషి చేస్తున్న మహిళలు అవార్డులకు అర్హులని తెలిపారు. ఈ నెల 23 లోగా ఆసక్తి కలిగిన మహిళలు తమ దరఖాస్తులను నగరపాలక సంస్థ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఎంపిక అయిన వారికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జూన్ 5న అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

దోబీఘాట్లు లేక రజకులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఎక్కువ గ్రామాల్లో దోబీఘాట్‌లేక రజకులు తీవ్ర ఇబ్బందులు రజకులు పెన్నా, కుందూ, కెసి కాలువ, వంకలలో తమ వృత్తిని కొనసాగించాల్సి వస్తోంది. అయ్యవారిపల్లి వద్ద దోబీఘాట్ ఆ పరిధిలోని రజకులకు కాస్త ఊరటగా ఉంది. మిగిలిన గ్రామాల్లో దోబీఘాట్‌లను ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. అయినా పట్టించుకోవడం లేదు. గతంలో బిసి కార్పొరేషన్ కింద బోరు వేసి దోబీఘాట్‌లకు గదులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం వాటి నిర్మాణం ఊసేలేదు. ఎక్కువగా కుందు నది, కెసి కాలువ నీటిపై రజకులు ఆధారపడాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో వాటికి నీరు ఎక్కువ వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దుస్తులను ఆరబెట్టేందుకు కూడా నదిలో సమస్యగా ఉంది. వంకలలో దుస్తులు ఉతికిన తర్వాత రోడ్ల పైన ఆర పెట్టాల్సిన పరిస్థితి. చాపాడు, సీతారామపురం, శ్రీరాములపేట, అన్నవరం, మడూరు గ్రామాల వద్ద కుందు నదిలో రజకులు దుస్తులు శుభ్రం చేస్తున్నారు. మొర్రాయిపల్లి, సోమాపురం, సిద్ధారెడ్డిపల్లి, బద్రిపల్లి, లక్ష్మీపేట గ్రామాల రజకులు కెసి కాలువ పరిధిలో కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోబీఘాట్‌లు ఏర్పాటు చేసి, తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కుందూ నదిలో దుస్తులు ఉతుకుతున్న రజకులు

మోసగించడం వల్లే వైసిపికి పరాభవం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉద్యోగులను నమ్మించి మోసగించడం వల్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి పరాభవం ఎదురైందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వైసిపికి శరాఘా తమన్నారు. ప్రభుత్వం పట్ల విద్యావంతుల్లో ఉన్న వ్యతిరేకతకు ఇది ఒక సంకేతమని తెలిపారు. పిఆర్‌సిని సకాలంలో అమలు చేసి, సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఉద్యోగులను హామీ ఇచ్చారని తెలిపారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వాటిని నెరవేర్చలేదన్నారు. ప్రత్యేక హోదా సాధించి ఉద్యోగాల విప్లవం తీసుకొచ్చి, ఖాళీగా ఉన్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని కూడా వైసిపి చెప్పిందన్నారు. ప్రతి ఏడా జనవరి 1న జాబ్ క్యాలెండరును విడుదల చేస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం పల్ల అన్ని ప్రాంతాల్లో, అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి బయటపడిందన్నారు. పలు ప్రలోభాలను చూపినా వైసిపి అభ్యర్థుల ఓటమిని ఆపలేకపోయాయని వివరించారు. ఉత్తరాంధ్రలో పట్టభద్రులు వైసిపిని పూర్తిగా తిరస్కరించారన్నారు. ఇప్పటికైనా రాజధాని అమరావతి నుండి విశాఖకు తరలించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు. వైసిపి మునిగి పోయే పడవ లాంటిదని అక్కడ ఉన్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరాలని కోరారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే వైఎస్ ఆశయమని ఆ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రమ్మని వైసిపి శ్రేణులకు తులసిరెడ్డి పిలుపునిచ్చారు.

వైసిపిని కాంగ్రెస్‌లో విలీనం చేయాలి

ప్రొద్దుటూరు : పాలన చేతకాకపోతే వైసిపిని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు జిలాన్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలోని ప్రభుత్వాలు అఖిల భారత సర్వీసు పూర్తి చేసుకున్న వారిని సలహాదారులుగా నియమించుకునేవని, జగన్ మాత్రం నిషానీ (వేలిముద్ర)లను సలహాదారులుగా నియమించుకోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి జగన్ తండ్రి దివంగత నేత వైఎస్ గతంలో ఉన్నత విద్యావంతులను సలహాదారులుగా నియమించుకొని గొప్పగా పాలించారన్నారు. వైఎస్‌పై సానుభూతితో సాధించుకున్న ముఖ్యమంత్రి పదవిని జగన్, ప్రధాని మోడీ ముందు సాగిలపడేలా చేస్తూఉండడం శోచనీయమన్నారు. ముందుగా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నజీర్ మాట్లాడుతూ జగన్ పాలనంతా ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియా, డీజల్, పెట్రోల్ మాఫియా ఇలా అవినీతిమయంగా మారిందన్నారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని రక్షించేందుకని జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ప్రధానిని, కేంద్ర హోం మంత్రిని కలిసి మాయమాటలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో విజయకుమార్, సైమన్, భాస్కర్, మస్తాన్, రవిశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నజీర్

చిరుధ్యానాలతో ఆరోగ్యం పదిలం

ర్యాలీలో పాల్గొన్న జడ్‌పిటిసి, ఎంపిపి, విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

చిరు ధ్యానాలను ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి పేర్కొన్నారు. చిరు ధ్యానాల మహోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జడ్‌పిటిసి, ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవ ధ్యానాలను ప్రతి రైతు సాగు చేయాలని కోరారు. పురుగు మందులతో పంటను సాగు చేస్తే, అవి తిన్న ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తింటున్నట్లు చెప్పారు. పూర్వం రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎక్కువగా చిరు ధ్యానాలను పండేంచేవారని వివరించారు. కాలానుగుణంగా చిరు ధ్యానాల సాగు తగ్గిందన్నారు. మెట్ట భూముల్లో తక్కువ వర్షపాతం నమోదైనా మొలకలు వస్తాయన్నారు. సాగు ఖర్చులు కూడ తగ్గుతాయని తెలిపారు. నవధాన్యాలు వేయడం వల్ల భూమిలో సూక్ష్మజీవులు, వాన పాములు అభివృద్ధి చెంది వాటి ద్వారా జీవవైవిద్యం పెరుగుతుందని తెలిపారు. అడిషనల్ డిపిఎం వసంతకుమారి మాట్లాడుతూ చిరు ధాన్యాల పంటల సాగు వల్ల పశువులకు మేత అందుబాటులో ఉంటుందన్నారు. అంతర పంటలు సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. చిరు ధ్యానాల సాగు ప్రోత్సాహించాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ రాజేంద్ర ప్రసాద్, ఎపిఎం బాలస్వామి, ఎపిసిఎన్ఎఫ్ మండల ఇన్‌ఛార్జి బాబు, రైతు భరోసా సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయోత్సాహంలో టిడిపి శ్రేణులు

ఖాజీపేటలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

వేంపల్లెలో సంబరాలు జరుపుకొంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడు రామ్‌గోపాల్‌రెడ్డి విజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు శనివారం విజయోత్సవాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ కూడలిలో శనివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో పెద్ద ఎత్తున టపాసులు పేల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సందుల నాగశివారెడ్డి, కమలాపురం ఫరూక్ అహ్మద్, కమలాపురం గౌస్ మొహిద్దిన్, మామిళ్ల కృష్ణారెడ్డి, బండి వెంకటేష్, వీరయ్య, తుట్టె రాము యాదవ్, పిచ్చి నాయుడు, రామానాయుడు, పల్లె గంగాధర్, పత్తూరు ఉపసర్పంచు ముత్తూరు రమణ, జెండాల మహబూబ్ బాషా, కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, నిగినేని పుల్లయ్య నాయుడు, నరసింహులు యాదవ్, ప్రతాప్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వెంకటయ్య యాదవ్ పాల్గొన్నారు. **చాపాడు :** గాడి తప్పిన రాష్ట్రాన్ని కాపాడడం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమనే నిర్ణయానికి ప్రజలు వచ్చారనడానికి నిదర్శనం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడమే అని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమలతోపాటు సిఎం సొంత జిల్లాలో కూడా ఉన్న సీటు గెలవబోతున్నామన్నారు. రాష్ట్రంలోని 108 నియోజక వర్గాల్లో పట్టభద్రులు ఇచ్చిన తీర్పు ఇది అని తెలిపారు. ఈ ఫలితాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయానికి తొలిమెట్లు అన్నారు. వైసిపి అరాచక పాలనకు చెంపపెట్టుగా 60శాతంపైగా నియోజక వర్గాల విద్యావంతులు తమ తీర్పును స్పష్టంగా తెలిపారన్నారు. టిడిపి విజయం కోసం శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు, అనంతపురం నుండి కర్నూలు వరకు అంకితభావంతో కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆచప కృతజ్ఞతలు తెలిపారు. **వేంపల్లె :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి మెజార్టీ రావడంతో వేంపల్లెలో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మండల టిడిపి కమిటీ ఆధ్వర్యంలో భారీగా బాణాసంచా కాల్చారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మిఠాయిలను కార్యకర్తలు తినిపించుకున్నారు. టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మాజీ టిడిపి జిల్లా కార్యదర్శి పివి రమణ, పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, వెంకట శివ, గోగుల మారుతి, పాపిరెడ్డి, ఈశ్వరయ్య, మైనార్టీ జిల్లా కార్యదర్శి పూల అల్లాబక్షు, నాగభూషణం, వెంకట శివ, శ్రీను, తిప్పారెడ్డి, రామకృష్ణారెడ్డి, మహబూబ్ షరీఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పట్టభద్రుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం యువకులు తమ ఓటుని ఆయుధంతో టిడిపికి పట్టం కట్టారని టిడిపి పట్టణ పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, మాజీ జడ్‌పిటిసి శివమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం రాంగోపాల్‌రెడ్డి నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పరిపాలనతో ప్రజలకు విసుగెత్తిందన్నారు. ముందుగా స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద బాణసంచా పేల్చి 'జై తెలుగుదేశం' అంటూ నినాదాలు చేశారు. అనంతరం రాంగోపాల్‌రెడ్డి ఇంటి వద్ద కేక్ కట్ చేసి ఆయన సతీమణి ఉమాదేవికి కేక్ తినిపించారు.

సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజనేయులు

ప్రజాశక్తి - వేంపల్లె

సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. స్థానిక స్వామి వివేకానంద పాఠశాలలో శనివారం సైన్సు ఫేర్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ విద్యార్థులు చేపట్టిన ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్సు ఫేర్ ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెరుగుతుందన్నారు. దేశానికి ఉపయోగపడేలా విద్యార్థులు ప్రయోగాలు చేయాలని కోరారు. ప్రతి పనికి సైన్సు అనేది అవసరమన్నారు. సైన్సు ఫేర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామాం జనేయురెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కొనుగోలులో పారదర్శకత ఉండాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రైతులకు, ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారద్శకంగా శనగలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులోని ప్రభుత్వ శనగల కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనగ రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5,335తో మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ఇప్పటివరకు దాదాపు 8,000 కింటాలను నాఫెడ్ ద్వారా ప్రభుత్వం శనగలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ శ్రీకాంత్‌రెడ్డి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న శశిభూషణ్‌రెడ్డి

పిల్లలకు టీకాలు తప్పక అందించాలి

- జిల్లా ఆరోగ్య శాఖ పర్యవేక్షణ అధికారి శశిభూషణ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పిల్లలకు టీకాలు తప్పక అందించాలని జిల్లా ఆరోగ్యశాఖాధికారి శశిభూషణ్‌రెడ్డి సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పిల్లలకు అందిస్తున్న టీకా కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఎర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలసపల్లె, పట్టణంలోని క్రాంతినగర్, చిలమకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడుజివ్వి, చిలమకూరు ప్రాంతాల అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించి, పలు సూచనలు అందించారు. 0-2 సంవత్సరాల పిల్లలకు టీకాలు తప్పక వేయాలన్నారు. గర్భిణులు, పిల్లలకు వేసిన టీకాలు ఎంసిపి కార్డు, ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సాయిచరిత, జ్యోత్స్న, హెల్త్ సూపర్‌వైజర్లు ఓబులేసు, విజయ్‌కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేదలకు సిఎం సహాయనిధి వరం లాంటిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక చేయూతనందిస్తూ ఆయా కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఏర్పాటు చేశారని అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం 12 మంది లబ్ధిదారులకు సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.18.43లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. రాజకీయాలకతీతంగా కేవలం పేదరికమే ప్రామాణికంగా తీసుకొని సహాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీలో ఎమ్మెల్యే రాచమల్లు

విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి కడప అర్బన్

విద్యార్థులు పట్టుదలగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి ఆకాక్షించారు. శనివారం నగరంఒని నాగార్జున మెడల్‌స్కూల్ నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కడప జిల్లాలోనే కాక రాష్ట్రస్థాయిలోనే ఒక ఉత్తమ విద్యాసంస్థను స్థాపించి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నట్లుగా విద్యార్థులు కూడా కృషి, దీక్ష, పట్టుదలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. జెసి సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ తాను కూడా ఈ పాఠశాల పూర్వవిద్యార్థినేనని చెప్పారు. 20 సంవత్సరాల తర్వాత మళ్లీ ఇదే పాఠశాలకు ఐఎఎస్ అధికారిగా వార్షికోత్సవ వేడుకలకు అతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరో అతిథి మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యనందిస్తున్న పాఠశాల యాజమాన్యం కృషి అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ముందుగా అతిథులు విద్యా సంస్థల చైర్మన్ ఎం. శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సైన్స్‌ఫెయిర్, వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. చివరిగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

మహారాజరాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, కడప

I.A.No. 399/2022
In
O.S.NO: 73/2022

Sudha Durga Prasad Rao, S/o Sudha Mallikarjuna Rao, aged about 52years, R/o D.No.7/719, Mochampeta, Kadapa City, Kadapa District-516001. ...Petitioner/Plaintiff

Vs

1. Synchroserve Global Solutions Pvt.Ltd., Represented by Its founder and CEO, Adapa Raja Suresh Kumar, S/o Late Sri Adapa Satya Narayana Rao, aged 56 Years, Resident of Plot No.5, Road No.72, Jubilee Hills, Hyderabad-500033.
2. Adapa Raja Suresh Kumar, S/o Late Sri Adapa Satyanayana Rao, aged 56 Years, R/at Plot No.5, Road No.72, Jubilee Hills, Hyderabad-500033.

...Respondents/Defendants

NOTICE TO RESPONDENTS 1 AND 2

ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, తీర్పునకు ముందే జప్తు కొరకు దాఖలు చేసిన పిటిషన్ కేసు మీ హాజరు కొరకు 17.04.2023వ తేదీన ఉదయం గం.10.30ని.లకి పై తెలిపిన కోర్టు నందు వాయిదా వున్నది. కావున స్వయంగా కానీ, వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్ష మునందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//
K. VENKATA SUBBAIAH, B.A.,BL.,
Advocate, KADAPA. Cell:9704890225.

మహారాజరాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్, కడప

O.S.NO: 73/2022

Sudha Durga Prasad Rao, S/o Sudha Mallikarjuna Rao, aged about 52years, R/o D.No.7/719, Mochampeta, Kadapa City-516001.

...Plaintiff

Vs

1. Synchroserve Global Solutions Pvt.Ltd., Represented by Its founder and CEO, Adapa Raja Suresh Kumar, S/o Late Sri Adapa Satya Narayana Rao, 56 Years, R/o Plot No.5, Road No.72, Jubilee Hills, Hyderabad-500033.
2. Adapa Raja Suresh Kumar, S/o Late Sri Adapa Satyanayana Rao, aged 56 Years, R/at Plot No.5, Road No.72, Jubilee Hills, Hyderabad-500033.

...Defendants

ప్రతివాదికి సమన్లు

ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, పై నెంబరు కేసు మీ హాజరు కొరకు 17.04.2023వ తేదీన ఉదయం గం.10.30 ని.లకు పై తెలిపిన కోర్టు నందు వాయిదా వున్నది. కావున స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షము నందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//
K. VENKATA SUBBAIAH, B.A.,BL.,
Advocate,
KADAPA. Cell:9704890225.